క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



మక్తల్: జాతీయ స్థాయి షూటింగ్ పోటీలకు మక్తల్‌కు చెందిన ఆరుగురు బాలబాలికలు ఎంపికైనట్లు జిల్లా ప్రధాన కాకర్యదర్శి, విశ్రాంతి పీఈటీ గోపాలం అన్నారు. ఊట్కూర్ మండంల బిజ్వార్ గ్రామంలో ఏప్రిల్ 25 నుంచి 27 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి 44వ సబ్ జూనియర్ షూటింగ్ చాంపియన్ షిప్ పోటీలలో జిల్లా జట్టుకు కల్యాణి, హేమలత, దివ్య, ప్రవీణ, జ్యోతి, నవ్యశ్రీ ఎంపికయ్యారు. వీరు ఈనెల 22 నుంచి 24 వరకు బీహార్‌లో జరిగే జాతీయ క్రీడల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా బాలికలను ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

మొక్కలకు రక్షణ ఏది?



మాగనూర్: పచ్చదనం పెంపులో భాగంగా అధికారులు మండల కేంద్రంలోని జాతీయ రహదారి డివైడర్ మధ్యలో మొక్కలు నాటారు. అయితే వాటికి రక్షణ మాత్రం కరువైంది. నాటిన కొన్ని రోజులోకే మేకలు మొక్కలు తినేస్తున్నాయి. కనీస రక్షణ చర్యలు తీసుకోకపోవడంతోనే పచ్చదనం లక్ష్యం ఇలా నీరు కారిపోతుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బస్టాండ్ చౌరస్తా నుంచి ఒకవైపు మొత్తం మొక్కలు లేకుండా పోయాయని, మిగిలిన మొక్కలకైనా రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

పందుల బారి నుంచి కాపాడండి



మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్ గ్రామంలో పందులతో గ్రామస్తులకు తంటాలు తప్పడం లేదు. కొంత కాలంగా గ్రామంలో పందులు విధ్వంసం సృష్టిస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ముఖ్యంగా ఇళ్లలోకి రావడం, దుర్గంధం లేపడంతో పాటు పంట పొలలు, ధాన్యంపై దాడి చేసి నాశనం చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందుల పెంపకం దారులకు చెప్పిన పట్టించుకోవడం పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత



మక్తల్: మండలంలోని పంచదేవ్‌పాడు గ్రామానికి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి మక్తల్ బస్టాండ్‌లో ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈఘటనపై పోలీస్ స్టేషన్‌లో వారం రోజుల క్రితం ఫిర్యాదు అందజేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు అదే గ్రామంలో సెల్‌ఫోన్ లోకేషన్ చూపించడంతో రికవరీ చేశారు. ఈ క్రమంలో బుధవారం బాధితుడు వెంకటేశ్‌కు ఎస్‌ఐ భాగ్యలక్ష్మి రెడ్డి సెల్‌ఫోన్ అందజేశారు.

విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవం

మద్దూరు: విశ్వహిందూ పరిషత్ 62వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం మద్దూరులోని పాతబస్టాండ్ ఆంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీకృష్ణుడి ఫొటోకు పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ.. 1964లో ఎంఎస్ గొళ్వాల్కర్, ఆప్టే ఇద్దరు కలిసి హిందూ సమాజాన్ని ఏకీకృతం చేయడానికి ఈ సంస్థను స్థాపించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సాయప్ప, ప్రభారి కాళప్ప, నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ వృత్తి విలువలను కాపాడుదాం

ఊట్కూరు: జర్నలిస్ట్ వృత్తి విలువలను కాపాడేందుకు జర్నలిస్టులందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని పీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జి మధుగౌడ్ అన్నారు. మండల కేంద్రమైన ఊట్కూరులో బుధవారం పీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విలువలతో కూడిన జర్నలిజాన్ని ప్రోత్సహించేందుకు పీయూడబ్ల్యూజే యూనియన్ కృషి చేస్తుందన్నారు.

బాలామృతం.. పక్కా ఆరోగ్యం



బాలామృతం అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్



అంగన్‌వాడీ కేంద్రంలో అందజేసే పౌష్టికాహారం

- మూడేళ్లలోపు చిన్నారులకు అందజేత
- ఎత్తు, బరువు పెరిగేలా పోషకాలు జోడింపు
- అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మాగనూర్: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. అందులో భాగంగానే చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకు అంగన్వాడీ టీచర్లు సైతం నిత్యం అవగాహన కల్పిస్తుండటంతో ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు బాలామృతం ప్లస్, బాలామృతం ప్యాకెట్లు అందిస్తోంది. మక్తల్ ప్రాజెక్టు పరిధిలోని మాగనూర్ మండలంలో 33 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 1017, మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు వారు 732 మంది ఉన్నారు. అలాగే 224 మంది గర్భిణులు , 222 మంది బాలింతలు ఉన్నారు. మండల పరిధిలో బలహీనంగా ఉన్న 60 మంది చిన్నారులకు బలవర్ధకమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం బాలామృతం ప్లస్‌ను అందజేస్తుంది.

ఎత్తు, బరువు ఆధారంగా నమోదు..

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషక విలువలున్న బాలామృతాన్ని చిన్నారులకు అందిస్తున్నారు. బాలామృతం ప్లస్‌లో పాలపొడి, వేరుశెనగ నూనె, రైస్ , గోధుమలు, కందిపప్పు, పంచదారతో పాటు కొవ్వు పదార్థాలు కలిగిన మిశ్రమం జత చేస్తారు. ఎదుగుదల లోపించిన చిన్నారులకు ఈ ఆహారం అందించి మూడునెలల పాటు చిన్నారుల ఎదుగుదల, పోషకలోపాల తీరును పరిశీలిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి నెలా బరువు, ఎత్తు ఆధారంగా ఆరోగ్య పరిస్థితిని రికార్డుల్లో నమోదు చేసి అందుకు తగ్గట్లు చర్యలు తీసుకుంటున్నారు.

చిన్నారులకు ఆరోగ్య కార్డులు..

చిన్నారులు ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్య కార్డులను మెయింటెన్ చేస్తున్నారు. పిల్లలకు పాలు, గుడ్లు, బాలామృతం, మధ్యాహ్న భోజనం, చిరుతిండ్లు అందిస్తున్నారు. ప్రతి చిన్నారికి ప్రత్యేక ఆరోగ్య పర్యవేక్షణ కార్డులు అందించి, వారి ఎత్తు, బరువు కొలతలు తీసుకునే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఎన్నో పోషకాలు..

చిన్నారుల ఎదుగదల కోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలామృతం అందిస్తోంది. ఇందులో ఎన్నో పోషకాలుంటాయి. ఏడునెలల చిన్నారి నుంచి మూడేళ్ల లోపు వయస్సు ఉన్నవారికి దీనిని అందిస్తున్నాం. బాలామృతాన్ని రోజూ చిన్నారులకు తినిపించేలా తల్లులకు అవగహన కూడా కల్పించి ప్రతినెలా బరువును, ఎత్తు కొలత తీసుకుంటున్నాం.

–తులసి, అంగన్‌వాడీ టీచర్, మాగనూర్

చిన్నారుల ఎదుగుదలకు..

పోషకాహార లోపం ఎదుర్కొంటున్న చిన్నారులకు ప్రభుత్వం బలవర్ధకమైన ఆహారంగా బాలామృతం ప్లస్‌ను అందిస్తోంది. ముందుగా అంగన్‌వాడీ సిబ్బంది పోషకాహారం లోపంతో ఉన్న చిన్నారులను గుర్తించి దీనిని అందిస్తున్నాం. చిన్నారుల తల్లులు ఈ బాలామృతం ప్లస్‌ను సద్వినియోగం చేసుకుంటే పిల్లలు ఆరోగ్యంగా తయారవుతారు.

–అమ్మక్క, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, మాగనూర్

నష్టపరిహారం పెంచేందుకు కృషి



భూ పరిహారం చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట: నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా భూనిర్వాసితులకు నష్టపరిహారం పెంచే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి రైతులకు భరోసా కల్పించారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో దామరగిద్ద మండలంలోని బాపన్‌పల్లి, దామరగిద్ద తండాకు చెందిన భూ నిర్వాసితులకు భూ పరిహారం చెక్కులను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన జన్మదినం రోజున రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా నారాయణపేట నియోజకవర్గంతో పాటు మక్తల్, కొడంగల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. సీఎం రేవంతన్నతో మాట్లాడి రైతులకు నష్టపరిహారం పెంచేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ ఆర్.శివారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం శివకుమార్‌రెడ్డి, ఆర్డీఓ రాంచందర్ నాయక్, తహసీల్దార్ తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మహ్మద్ సలీం, నాయకులు సతీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న తపస్ జిల్లా అధ్యక్షుడు షేర్ కృష్ణారెడ్డి

నారాయణపేట: ఉద్యోగ ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేర్ కృష్ణారెడ్డి, నరసింహ డిమాండ్ చేశారు. తపస్ సభ్యత్వ నమోదులో భాగంగా బుధవారం మండలంలోని కోటకొండ, జాజాపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి వారు మాట్లాడారు. సీపీఎస్ ఉత్తర్వులు ఆగస్టు 23న వచ్చినందున అదే రోజు కలెక్టర్, తహసీల్దార్లకు వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. అలాగే ఆ ఉత్తర్వులను దహనం చేయనున్నట్లు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. పెండింగ్ బిల్లులను చెల్లించాలని, నూతన పీఆర్సీ ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం చొరవ తీసుకొని పదోన్నతుల ప్రక్రియ కొనసాగించాలని, ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నచోట బోధన సహాయకులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కో కన్వీనర్ విజయ, జిల్లా కార్యదర్శి రవికుమార్,లక్ష్మణ్, మండల గౌరవ అధ్యక్షులు శంకర్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి చిన్న నర్సింలు, ప్రధానోపాధ్యాయులు భారతి, శ్రీనివాస్, మండల నాయకులు మధు, సంధ్యారాణి, శ్రీనివాస్, చిన్నయ్య, తిరుపతి, రెడ్డి,మంగళ, శ్రీదేవి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నూతన రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

మద్దూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినా సన్న బియ్యాన్ని రేషన్‌కార్డు దారులు సద్వినియోగం చేసుకోవాలని కోస్గి ఏఎంసీ చైర్మన్ భీములు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా, డీఎస్‌ఓ బాలరాజు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మహేష్‌గౌడ్ 1,598 నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే సన్నబియ్యాన్ని పక్కదారి పట్టిస్తే లబ్ధిదారుల కార్డులను రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ అనంద్, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, ఆర్‌ఐలు అమరేందర్‌శెట్టి, అమర్‌నాథ్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

పడమటి ఆంజనేయస్వామి కోనేరు పరిశీలన



ఆంజనేయస్వామి కోనేరును పరిశీలిస్తున్న నిపుణురాలు కల్పన

మక్తల్: పట్టణంలో శ్రీపడమటి ఆంజనేయస్వామి దేవాలయం కోనేరును బుధవారం అర్కిటెక్ నిపుణురాలు కల్పన , ఈఓ సత్యనారాయణ పరిశీలించారు. డిసెంబర్‌లో జరిగే ఉత్సవాల వరకు కోనేరు పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఇటీవల రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాలతో కోనేరును పరిశీలించినట్లు తెలిపారు. ఏఈ నాగశివ రాంలీలా మైదానంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా భద్రత చర్యలు తీసుకోవాలని కోరారు. ఈమె వెంట ఆలయ చైర్మన్ ప్రాణేశ్‌కుమార్, మార్కెట్ వైస్ చైర్మన్ గణేశ్‌కుమార్, రవికుమార్, మందుల నరేందర్, కట్టసురేశ్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలను పూడ్చిన పోలీసులు



నారాయణ పేట క్రైమ్: మండల పరిధిలోని జాజపూర్ గ్రామ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతల వల్ల వాహనదారులు, గ్రామస్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం రూరల్ ఎస్ఐ శ్రీ రాముడు దృష్టికి రాగా బుధవారం సిబ్బందితో కలిసి రోడ్డుపై మోరం వేయించి గుంతలు పూడ్చి వేశారు. పోలీసులు కేవలం చట్ట పరిరక్షణకే పరిమితం కాకుండా ప్రజల భద్రత కోసం సామాజిక బాధ్యతతో పని చేయడం అభినందనీయమని పలువురు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



మద్దూరు: మండలంలోని దోరేపల్లి గ్రామంలో ఓ ఇల్లు షాట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సకలి నర్సమ్మ ఇంట్లో షాట్ సర్క్యూట్ కావడంతో ఇల్లు కాలిపోయింది. వర్షాకాలం కావడంతో ఇల్లు కారడంతో ఆమె పక్కింట్లో నిద్రపోయింది. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న వంట సామగ్రి, బియ్యం, బట్టలు దగ్ధమైనట్లు బాధితురాలు పేర్కొన్నారు. దాదాపు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితురాలు వాపోయారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



గోటూర్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ధన్వాడ/మరికల్/దామరగిద్ద: నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ పర్ణికారెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గోటూర్ గ్రామంలో ఆమె చిత్రపటాన్ని ఏర్పాటు చేసి కేక్ కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

- మరికల్ చౌరస్తాలో బుధవారం ఎమ్మెల్యే పర్ణికారెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి, ఆస్పత్రిల్లో రోగులకు పండ్లు, బెడ్లను పంపిణీ చేశారు.
- దామరగిదలోని క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ఆవరణలో కేక్ కట్ చేశారు.

రక్తంతో గీసిన చిత్రపటం..



రక్తంతో గీసిన చిత్రపటాన్ని ఎమ్మెల్యేకు అందజేసిన వీరాభిమాని సంధ్యారెడ్డి

నారాయణపేట: నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డికి పట్టణానికి చెందిన ఆమె వీరాభిమాని సంధ్యా రెడ్డి (కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్) తన రక్తంతో ఎమ్మెల్యే చిత్రపటాన్ని గీసి బహూకరించారు. అలాగే జన్మదిన వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరంలోనూ సంధ్యా రెడ్డి రక్తదానం చేసింది. అప్పటిదాకా పూలమాలలు శాలువాలు, జ్ఞాపికలతో సన్మానం పొంది జన్మ దిన వేడుకలలో మునిగిన ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి తన అభిమాని ఇచ్చిన రక్తంతో గీసిన చిత్రపటం చూసి ఒకింత ఆశ్చర్యానికి లోనైంది.

బాధ్యతాయుతంగా పనిచేయాలి



కోస్గి రూరల్: ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలందిస్తే సమాజంలో పోలీసుల పట్ల గౌరవ మర్యాదలు పెరుగుతాయని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. బుదవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో కోస్గి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్‌ఐ ఆంజనేయులు ఎస్‌ఐగా పదోన్నతి పొందడంతో రెండు స్టార్‌లను అలంకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పేదలకు అండగా ఉంటూ తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సూచించారు.

నీట మునిగిన పంటలు



నర్వ: మండలంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు పంటలన్నీ నీట మునిగాయని రైతులు వాపోయారు. ఆయా గ్రామాల్లో పత్తి, కంది, ఆముదం పంటలు నీటితో నిండిపోయి ఎర్రబారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎటుచూసిన నీళ్ళు కనిపిస్తున్నాయని, ఇకనైన వర్షాలు తగ్గుముఖం పట్టకపోతే పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. పంట నష్టంపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు.

గుంతలమయంగా కన్మనూర్ రోడ్డు



మరికల్: ఇటీవల ఎడితెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కన్మనూర్ రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. మరికల్ నుంచి కన్మనూర్ మీదుగా నర్వ, మక్తల్ వెళ్లే ఈ ప్రధాన రహదారిపై ఇటుక బట్టీలకు సంబంధించిన టిప్పర్లు, భారీ వాహనాలు తిరగడంతో రోడ్డు దెబ్బతింది. దీనికి తోడు వర్షాలకు గుంతలు పడి మురుగు నిలవడంతో రాకపోకలు సాగించడానికి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి తాత్కాలికంగా అయిన గుంతలను పూడ్చాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

నర్వ: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా ఎంపికైన కొత్తపల్లి కార్యదర్శి కృష్ణకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో తోటి పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాఘవేందర్, సీనియర్ అసిస్టెంట్ బాలాజీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ దేశ యువతకు స్ఫూర్తి



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శివకుమార్‌రెడ్డి, నాయకులు

సాక్షి నెట్‌వర్క్: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నేతలు అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

- నారాయణపేటలో డీసీసీ మాజీ అధ్యక్షుడు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కంభం శివకుమార్‌రెడ్డి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. స్థానిక సీవీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించడంతో పాటు ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టిన మహానేత రాజీవ్‌గాంధీ అని ఆయన సేవలను కొనియాడారు.
- మక్తల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మక్త్ మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ గణేశ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు బోయేరవి తదితరులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.
- కోస్గిలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు యథావిధిగా నడపండి



డీఎం లావణ్యకు వినతిపత్రం అందజేస్తున్న ప్రయాణికులు

నారాయణపేట టౌన్: పెద్ద జట్రం–నర్వ బస్సు సమయాన్ని మార్చాలని డీఎం లావణ్యకు బుధవారం సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహా, ప్రయాణికులు ఎమ్.నవీన్, అంజి తదితరలు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఈ బస్సు గతంలో నారాయణపేటలో మధ్యాహ్నం 1.30 నిమిషాలకు బయలుదేరి పెద్దజట్రం, నర్వ మీదుగా రాంపూర్ గేట్ వరకు వెళ్లి సాయంత్రం 6.15 నిమిషాలకు పేట డిపోకు వచ్చేదన్నారు. ఇదే బస్సును అమరచింత వరకు పొడగించడం ద్వారా డిపోకు వచ్చే వరకు సాయత్రం 7 గంటలు అవుతుందని కావునా ఎప్పటి మాదిరిగానే పేట డిపోలో సాయత్రం 6.15 నిమిషాలకు వచ్చేలా చూడాలన్నారు.

వర్షానికి కూలిన షెడ్డు



ఊట్కూరు: భారీ వర్షాలకు మండలంలోని బిజ్వార్ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన మహమ్మద్‌బాబా షెడ్డు కూలిపోయింది. ఆ సమయంలో రేకుల షెడ్డు ఎవరు లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పిందని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంకటేష్‌గౌడ్, జి హన్మిరెడ్డి, రామలింగంగౌడ్ కూలిపోయిన షెడ్డును పరిశీలించి బాధితుడిని పరామర్శించారు. ప్రభుత్వం వెంటనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.

నారాయణపేట వాసికి డాక్టరేట్ ప్రదానం

నారాయణపేట టౌన్: నారాయణపేట మండలంలోని అప్పిరెడ్డిపలికి చెందిన శ్రీధర్‌కు ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి ఆంగ్లంలో పీహెచ్‌డీ డిగ్రీ పొందాడు. ఈయన రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలలోని గురుకుల పాఠశాలలో ఇంగ్లీష్ నేర్చుకోవడంలో డిజిటల్ సాధనాల ప్రభావం అనే అంశంపై చేసిన పరిశోధనకు గానూ డాక్టరేట్ అందజేసినట్లు శ్రీధర్ తెలిపాడు.

నేడు వైద్యశిబిరం

నారాయణపేట టౌన్: లయన్స్ క్లబ్ నారాయణపేట వారి ఆధ్వర్యంలో గురువారం పాత బస్టాండ్ దగ్గర ఉన్న చిల్డ్రన్ హాస్పిటల్‌లో వైద్యాశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ హరి నారాయణ్ భట్టడ్ తెలిపారు. శిబిరంలో చిన్న పిల్లలకు వివిధ పరీక్షలతో పాటు మందులు అందజేయనున్నట్లు తెలిపారు.

వార్డు సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట టౌన్: పట్టణంలోని మూడో వార్డు శ్రీ నగర్ కాలనీ, సింగర్‌బేస్‌లోని శాంతి నగర్ వీధులలో పలు సమస్యలు నెలకొన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని ఆ వార్డు మాజీ కౌన్సిలర్ నారాయణమ్మ భీమయ్య కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. 3వ వార్డులోని సింగార్ బేస్‌లోని శాంతి నగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదని దాని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అదే విధంగా ఈ నెల 27న వినాయక చవితి ఉండడంతో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

క్రీడాకారులను అభినందించిన డీఈఓ

నారాయణపేట: ఎస్‌ఎఫ్ అండర్–15 విభాగంలో ఈనెల 18, 19 తేదీల్లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లో నారాయణపేట బాలికల జట్టు మూడో స్థానం సాధించిన క్రీడాకారులను బుధవారం డీఈవో గోవిందరాజులు అభినందించారు. భవిష్యత్తులో మొదటి స్థానంలో నిలిచి జిల్లాకు గుర్తింపు తేవాలని సూచించారు. డీఈఓతో పాటు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నరసింహులు, డీఈఓ కార్యాలయ సిబ్బంది ఉదయబాను, ఫిజికల్ డైరెక్టర్స్‌సాయినాథ్, రవికుమార్, సినియర్ వాలీబాల్ క్రీడాకారులు జగదీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.